సాక్షి
అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 14 । ఏప్రిల్ । 2023



బిందు, తుంపర సేద్యంలో జిల్లాకు ద్వితీయస్థానం

బిందు, తుంపర సేద్యంలో అన్నమయ్య జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచింది. - 8లో



ఉద్యోగాల పేరుతో మోసం

ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి మోసం చేసిన ఇద్దరు మోసగాళ్లను అరెస్టు చేసినట్లు డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.74	రూ.90
రెండోరకం	రూ.50	రూ.72

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 210 మెట్రిక్ టన్నులు




రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్ర (సా॥)	సహర్ శని (ఉ॥)
రాజంపేట	6.33	4.43
రాయచోటి	4.40	6.33
మదనపల్లి	6.34	4.46
పీలేరు	6.31	4.35

మామిడి.. తగ్గిన దిగుబడి.!

అన్నమయ్య జిల్లాలో మామిడి సాగు చేసిన రైతుల ఆశలు అడియాసలవుతున్నాయి. చెట్టు నిండా పూత ఉన్నా ఆశించిన దిగుబడి లేక అల్లాడిపోతున్నారు. ఒకవైపు కరుణించని ప్రకృతి.. మరోవైపు తగ్గిన దిగుబడి.. ఇంకోవైపు లభించని గిట్టుబాటు.. ఇన్ని సమస్యల మధ్య కొట్టుమిట్టాడుతున్న రైతు దేవుడే దిక్కు అంటూ మామిడి చెట్ల వైపు దీనంగా చూస్తున్నాడు.



తోటల్లో చెట్లకు అంతంత మాత్రంగా కాసిన కాయలు



- ఒకసారి కాకుండా రెండుసార్లు పూత వచ్చినా ప్రయోజనం శూన్యం
- చలి, మంచు, ప్రకృతితోపాటు మామిడి రైతును దెబ్బతీసిన తెగుళ్లు
- కేవలం 20 శాతం మేర మాత్రమే చెట్లపై కనిపిస్తున్న కాయలు
- జిల్లాలో 37 వేల హెక్టార్లలో సాగులో ఉన్న మామిడి పంట
- ఈమారు దిగుబడులతోపాటు ధరలు కూడా పతనం

సాక్షి రాయచోటి: మామిడి రైతులకు ఈసారి కష్టకాలమే కనిపిస్తోంది. ఆశించిన మేర పంట దిగుబడులు లేవు.. ప్రకృతి కరుణించక, తెగుళ్ల బారినపడి.. సస్యరక్షణ సరిగా లేక, చలి, మంచు ప్రభావం రైతన్నను తీవ్రంగా దెబ్బతీసింది. భారీగా ఉన్న అంచనాల నుంచి ఏదో కొంత మేర దిగుబడి వస్తే చాలనే పరిస్థితి కనిపిస్తోంది. పెద్ద చెట్ల నుంచి ఎకరాకు ఐదు టన్నులకు పైగా దిగుబడి వచ్చే పరిస్థితి నుంచి కేవలం టన్నుకు పడిపోయింది. రెండుమార్లు పూత వచ్చినా ప్రయోజనం మాత్రం కనిపించలేదు. మూలిగే నక్కపై తాటికాయ పడిందన్న చందంగా ముందే దిగుబడి లేక అల్లాడుతున్న అన్నదాతను ధరల పోటు కలవరపెడుతోంది.

భారీగా తగ్గిన దిగుబడులు

అన్నమయ్య జిల్లా మామిడి పంటకు ప్రసిద్ధి చెందింది. ప్రధానంగా లాల్ బహార్, బేనీషా, ఖాదర్, తోతాపురి, బెంగులూర, ఇమామ్ పసంద్, చెరుకు రసం, మల్లిక, సువర్ణ రేఖ, దసేరి, మలుగూబా తదితర రకాలు సాగు చేశారు. జిల్లాలో 37 వేల హెక్టార్లలో మామిడి పంట సాగులో ఉండగా, అందులో 20 వేల హెక్టార్లలో కాయలు కాసే చెట్లు ఉన్నాయి. అయితే ప్రకృతి వైపరీత్యమో, తెగుళ్ల భారమో, చలి మంచు ప్రభావమో తెలియదుగానీ దిగుబడులు మాత్రం గణనీయంగా తగ్గిపోయాయి. కేవలం ఎకరాకు 5–8 టన్నులు కాసే పరిస్థితి నుంచి కేవలం రెండు టన్నుల్లోపు దిగుబడికి పరిమితమైంది.

అన్నదాతకు ఊహించని పరిస్థితి

జిల్లాలో మామిడి రైతులకు కష్టాలు తప్పడం లేదు. ఒకవైపు దిగుబడి అమాంతంగా తగ్గిపోగా, మరోవైపు ధరలు పతనం కావడంతో రైతన్న ఆందోళన చెందుతున్నాడు. నిన్నమొన్నటివరకు మొదటిరకం లాల్‌బహార్, బేనీషా తదితర రకాలు టన్ను కాయలు రూ. 70–80 వేలు పలుకగా, ప్రస్తుతం రూ. 30–40 వేలకు పడిపోవడం చూస్తే పరిస్థితి ఇబ్బందికరంగా మారింది.



నా పేరు అయోధ్యపురం పట్టాభి. మాది అన్నమయ్య జిల్లా మండల కేంద్రమైన రామాపురం. నాకు ఐదు ఎకరాల్లో 20 ఏళ్ల వయస్సుగల మామిడిచెట్లు ఉన్నాయి. నేను బేనీషా, లాల్ బహార్‌తోపాటు మరో రెండు, మూడు రకాల మామిడి కాయలు సాగు చేశాను. ప్రతి ఏడాది 25 నుంచి 30 టన్నుల వరకు దిగుబడులు వచ్చేవి. ఈసారి కేవలం 5 నుంచి 8 టన్నుల లోపే కాయలు వచ్చే పరిస్థితి ఉంది. దిగుబడితో పాటు ధరలు కూడా భారీగా తగ్గిపోయాయి.

ఆశించిన దిగుబడులు లేవు



అన్నమయ్య జిల్లాలో సుమారు 37 వేల హెక్టార్లలో మామిడి పంట సాగులో ఉంది. అయితే అందులో కాసే తోటలను పరిశీలిస్తే దిగుబడి కొంతమేర తగ్గింది. ఈసారి చలి, మంచుతోపాటు ఇతర కారణాలేవైనా దిగుబడుల శాతం తగ్గింది. వాతావరణం అనుకూలించకపోవడంతో మొదట వచ్చిన పిందెలు నిలబడ్డాయి. రెండు,మూడు విడతల్లో కాయలు నిలబడలేదు.

– రవిచంద్రబాబు, జిల్లా ఉద్యానశాఖ అధికారి, రాయచోటి, అన్నమయ్య జిల్లా

ఏఎఫ్‌యూ ఏర్పాటుకు వడివడిగా అడుగులు



గంగనపల్లిలో ప్రభుత్వం కేటాయించిన భూమిని మ్యాప్ ద్వారా పరిశీలిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

ఏఎఫ్‌యూ : డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం శాశ్వత భవన నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వం ఇటీవలే 110.36 ఎకరాల భూమిని కేటాయించింది. పెండ్లిమర్రి మండలం గంగనపల్లి గ్రామపరిధిలోని 17/1, 17/2 సర్వేనెంబర్‌లో ప్రభుత్వం భూమి కేటాయించడంతో, ఏఎఫ్‌యూ అధికారులు గురువారం స్థలపరిశీలన చేపట్టారు. వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ వైస్ చాన్సలర్ ఆచార్య బానోతు ఆంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డిలు ప్రభుత్వం కేటాయించిన భూమిని పరిశీలించారు. రెవెన్యూశాఖ భూమిని విశ్వవిద్యాలయానికి అప్పజెప్పాల్సి ఉండటంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యల గురించి చర్చించారు. రెవెన్యూశాఖ భూమిని అప్పజెప్పిన వెంటనే పనులు ప్రారంభించేలా సరిహద్దులను స్థానిక రెవిన్యూ అధికారుల సహాయంతో ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని డ్రోన్ సహాయంతో చిత్రీకరించి, లెవలింగ్ చేపట్టాలని ప్రాథమికంగా నిర్ణయించారు. ఈ సందర్భంగా వీసీ, రిజిస్ట్రార్‌లు మాట్లాడుతూ అనుకున్నవన్నీ నిర్దేశించిన గడువులోపు పూర్తయితే జూలై 8న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో శంకుస్థాపన చేయించేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. అనంతరం గంగనపల్లి వీఆర్‌ఓ పృథ్వీరాజ్, సర్వేయర్ సుబ్బరాయుడు సహకారంతో ఏఎఫ్‌యూ సిబ్బంది సరిహద్దులను గుర్తించి, మార్కింగ్ చేసుకున్నారు. కార్యక్రమంలో ఏఎఫ్‌యూ సూపరింటిండెంట్ వై. పవన్‌కుమార్ రెడ్డి, వై. అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

మే 13న జాతీయ లోక్ అదాలత్

మదనపల్లె: మే 13వ తేదీన మదనపల్లె కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు రెండవ అదనపు జిల్లా జడ్జి భాస్కర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కోర్టు కేసుల్లోని కక్షిదారులు రాజీమార్గంతో కేసులు సత్వర పరిష్కారం చేసుకోవచ్చున్నారు. రోడ్డు ప్రమాద కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, నగదు వివాద కేసులు, తదితర కేసుల్లో కక్షిదారులు పరస్పరం మాట్లాడుకుని రాజీ మార్గాన్ని అనుసరించాలన్నారు. కక్షిదారులు ఈ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కలెక్టర్‌ను కలిసిన జిల్లా ఎస్పీ



కలెక్టర్ గిరీషా పీఎస్‌కు పూలమొక్కను అందజేసి శుభాకాంక్షలు చెబుతున్న ఎస్పీ గంగాధరరావు

రాయచోటి: అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్‌ను జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. జిల్లా ఎస్పీగా బుధవారం రాత్రి బాధ్యతలు చేపట్టిన గంగాధర్‌రావు గురువారం కలెక్టర్‌ను ఆయన ఛాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతలు, తదితర అంశాలపై కలెక్టర్‌తో ఎస్పీ చర్చించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయసంస్థ గుంటూరు వారి ఆధ్వర్యంలో ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో నడుపుతున్న ఏపీఆర్ స్కూల్ జనరల్, ఏపీఆర్ స్కూల్స్ మైనార్టీ బాలుర, బాలికల పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో 5వ తరగతిలో అడ్మిషన్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. 6,7,8 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లు, ఇంటర్, డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇందుకు ఈనెల 24వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. మరిన్ని వివరాలకు https://aprs.apcfss.in వెబ్‌సైట్‌ను చూడాలని తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రవేశ పరీక్ష మే 20వ తేదీ జరగుతుందని డీఈఓ తెలిపారు.

21న వేళాంగిణికి ప్రత్యేక బస్సు



కడప కోటిరెడ్డిసర్కిల్ : వేళాంగిణికి మైదుకూరు డిపో నుంచి ఈనెల 21వ తేదీన ప్రత్యేక బస్సు సర్వీసును నడపనున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు మైదుకూరులో రాత్రి 7 గంటలకు బయలుదేరి కడప, నాగూరు, నాగపట్నం మీదుగా వెళుతుందన్నారు. ఈ బస్సు 22వ తేదీ ఉదయం 8 గంటలకు ముస్లింల పవిత్ర క్షేత్రం నాగూరుకు చేరుకుని 10 గంటలకు వేళాంగిణికి వెళుతుందన్నారు. తిరిగి ఆదివారం ఉదయం 11 గంటలకు వేళాంగిణి నుంచి బయలుదేరి సోమవారం తెల్లవారుజామున 4 గంటలకు కడపకు, 5.00 గంటలకు మైదుకూరుకు చేరుతుందన్నారు.

పోలీస్ చెక్ పోస్టు తనిఖీ

రామాపురం: విజువల్ పోలీసింగ్‌లో భాగంగా గురువారం రాత్రి మండల పరిధిలోని కొత్తరోడ్డు నారాయణపురం వద్ద పోలీస్ చెక్‌పోస్టును అన్నమయ్య జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్, పోలీస్ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. పలు రికార్డులను పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ ఎర్రచందనం, ఇసుక, నాటుసారా, అక్రమ మద్యం రవాణా జరగకుండా తనిఖీలు నిర్వహించాలన్నారు. తనిఖీలు చేపట్టే సమయంలో ఎలాంటి ప్రలోభాలకు లోను కాకూడదన్నారు. ఏదైనా పొరపాటు జరిగితే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అన్నమయ్య ప్రాజెక్టుకు ఎస్ఎల్‌టీసీ ఆమోదం

- పనులు చేపట్టనున్న రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీ
- సర్వే పనులు ప్రారంభం
- ప్రాజెక్టు నిర్మాణానికి మార్గం సుగమం

కడప సిటీ : ఎట్టకేలకు అన్నమయ్య ప్రాజెక్టుకు మహర్దశ పట్టింది. స్టేట్ లెవల్ టెక్నికల్ కమిటీ రాఘవ కన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ వేసిన టెండరును ఖరారు చేస్తూ ఇటీవల ఆమోదం తెలిపింది. దీంతో ప్రాజెక్టుకు సంబంధించిన సర్వే పనులు ప్రారంభమయ్యాయి. 2021 నవంబరు 19న వరద ఉధృతికి అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయింది. ఈ నేపథ్యంలో సీఎం వైఎస్ జగన్ ఆయా గ్రామాల్లో పర్యటించి అన్నమయ్య ప్రాజెక్టు పటిష్ట నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆమేరకు 2022 డిసెంబరు 26న టెండర్లను ఆహ్వానించారు. ఆన్‌లైన్ టెండర్లలో రెండు కంపెనీలు కోట్ చేయగా రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఈ టెండరును దక్కించుకుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి రూ. 660 కోట్లకు టెండరు వేశారు. సంబంధిత అగ్రిమెంటు కూడా పూర్తయింది. ఈ టెండరును ఆమోదించేందుకు సంబంధిత అధికారులు స్టేట్ లెవెల్ టెక్నికల్ కమిటీకి ఆమోదం కోసం పంపారు. ఆ కమిటీ ఆమోదం తెలపడంతో రాఘవ కన్‌స్ట్రక్షన్ కమిటీ ఈ పనులను చేపట్టింది. ప్రస్తుతం సర్వే పనులు జరుగుతున్నాయని ఇరిగేషన్‌శాఖ ఎస్ఈ శ్రీనివాస్ తెలిపారు.

రేపు రాజంపేటలో మెగా జాబ్ మేళా

ఏర్పాట్లను పరిశీలించిన రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

రాజంపేట:ఈనెల 15న రాజంపేటలోని ఏఐటీఎస్ క్యాంపస్‌లో మెగా జాబ్‌మేళాను ఎంపీ మిథున్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జిల్లాపరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు గురువారం ఏఐటీఎస్ క్యాంపస్‌లో ఏర్పాట్లను ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌మేళాకు 80కి పైగా బహుళజాతి కంపెనీల ప్రతినిధులు వస్తారన్నారు. నిరుద్యోగులకు ఉచిత బస్సు, భోజన సౌకర్యం కల్పించామన్నారు. అంతకుముందు ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, రాజంపేట రూరల్ సీఐ పుల్లయ్య, ఎస్ఐ భక్తవత్సలం, అన్నమాచార్య ఇంజినీరింగ్ కాలేజి ప్రిన్సిపాల్ నారాయణ, ఏఓ సుబ్బారెడ్డిలతో మెగాజాబ్‌మేళా నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఒంటిమిట్ట ఎంపీపీ గడ్డం జనార్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కొండూరు శరత్‌కుమార్‌రాజు, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు పసుపులేటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఏఐటీఎస్‌లో మెగా జాబ్‌మేళా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

జాబ్‌మేళాలో పాల్గొనే వారి కోసం..

ఏఐటీఎస్ క్యాంపస్‌లో నిర్వహించే మెగా జాబ్‌మేళాలో పాల్గొనే నిరుద్యోగుల నమోదు కోసం క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. వివరాలకు 9740212687, 9885797909, 9491475836 నంబర్లను సంప్రందించాలని కోరారు.

ప్రతి విద్యార్థికి జగనన్న విద్యా కిట్



విద్యాసామగ్రి కిట్‌ను భద్రపరిచే గదిని పరిశీలిస్తున్న వెంకటకృష్ణారెడ్డి, తదితరులు

కలకడ: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి పాఠశాల ప్రారంభించే నాటికే నాణ్యతతో కూడిన జగనన్న విద్యాకిట్ అందుబాటులో ఉంటుందని ఏపీ మోడల్ స్కూల్ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్, అన్నమయ్య జిల్లా పరిశీలకుడు ఎం.వెంకటకృష్ణారెడ్డి పేర్కొన్నారు. గురువారం కలకడ ఆదర్శ పాఠశాలను పరిశీలించారు. మండలంలోని 3,666 మందికి ప్రభుత్వం అందించే విద్యాకిట్‌లు భద్రపరిచేందుకు ఆదర్శ పాఠశాలలోని విశాలమైన గదిని ఎంపిక చేసినట్లు తెలిపారు. రూ.కోట్లు ఖర్చు పెట్టి, ప్రభుత్వం విద్యార్థులకు అన్ని వసతులు కల్పించి, నాణ్యమైన విద్యాసామగ్రిని పంపిణీ చేస్తోందన్నారు. ఏడాది పొడవునా కాకుండా విద్యా సంవత్సరం మొదటి రోజునే మొత్తం విద్యాసామగ్రి విద్యార్థి చేతిలో ఉంటుందన్నారు. అందుకు ముందే ప్రణాళికతో భద్రత కలిగిన పాఠశాలలను గుర్తిస్తున్నట్లు తెలిపారు. కాగా, అసంపూర్తిగా ఉన్న కలకడ ఆదర్శ పాఠశాల బాలికల హాస్టల్ భవనాన్ని పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు విడుదల చేసేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి మునీంద్రనాయక్, పాఠశాల ప్రిన్సిపాల్ మల్లంగ్‌షావలీ, భద్రత కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలు మరింత విస్తరించాలి

కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: బ్యాంకు సేవలను గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో మరింత స్థాయిలో విస్తరింపజేయాలని యూనియన్ బ్యాంక్ అధికారులకు కలెక్టర్ గిరీషా పీఎస్ సూచించారు. గురువారం రాయచోటి కలెక్టరేట్‌లోని ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్, డీఆర్‌డీఏ, మెప్మా సమక్షంలో బ్యాంకు ద్వారా మహిళా సాధికారిత కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక బృందాలకు బీపీ పరీక్ష యంత్రాలు, బాడీ వేయింగ్ మిషన్స్, షుగర్ టెస్టింగ్ మిషన్లను యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విరాళంగా అందజేసింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సామాజిక బాధ్యతను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ భాస్కర్, డిప్యూటీ రీజినల్ హెడ్ సుధాకర్, రాయచోటి పట్టణ బ్రాంచ్ మేనేజర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



కలెక్టర్ సమక్షంలో బీపీ, షుగర్ టెస్టింగ్ యంత్రాలు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

వేగవంతంగా రీసర్వే ప్రక్రియ

జిల్లాలో రీసర్వే ప్రక్రియ పనులను వేగవంతంగా పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ రాష్ట్ర భూపరిపాలన కమిషనర్ జి.సాయిప్రసాద్‌కు వివరించారు. గురువారం విజయవాడలోని సీసీఎల్ఏ కార్యాలయం నుంచి రాష్ట్రంలో జరుగుతున్న రీసర్వే ప్రగతిపై రాష్ట్ర భూపరిపాలన కమిషనర్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లాలో మొదటి దశ రీసర్వే పూర్తి చేసిన గ్రామాల్లో హద్దురాళ్లు పాతడం, ఖాతాలకు ఫొటో మ్యాపింగ్ తదితర ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేయడానికి కృషి చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. రీసర్వే పూర్తయిన మండలాలకు ఇప్పటికే రోవర్లను పంపామన్నారు. వాటి ద్వారా హద్దురాళ్లు పాతే ప్రక్రియను తహసీల్దార్లు, సర్వే శాఖ సిబ్బందితో ప్రతిరోజు సమీక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. రీసర్వేకు సంబంధించి ఆయా ప్రక్రియల పనులను కూడా లక్ష్యం మేరకు నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేయడానికి కృషి చేస్తున్నామని కలెక్టర్ వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ సత్యనారాయణ, కలెక్టరేట్ ఏఓ బాలకృష్ణ, సర్వే శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు సేవా పతకాలు

సాక్షి రాయచోటి: విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరిచిన పోలీసులకు రాష్ట్ర ప్రభుత్వం వివిధ సేవా పతకాలను ప్రకటించింది. ఉగాది సందర్భంగా ఏటా ఇచ్చే ఈ పతకాలను ప్రస్తుతం ప్రదానం చేయనుంది. వివరాలిలా.. అన్నమయ్య జిల్లాకు చెందిన ఎస్సీ,ఎస్టీ సెల్ డీఎస్పీ ఎన్.సుధాకర్‌కు ఉత్తమ సేవా పతకం, సుండుపల్లి హెడ్ కానిస్టేబుల్ బుక్కే దీప్లానాయక్, ఏఆర్ ఎస్ఐ ఎన్. మల్లికార్జున, కానిస్టేబుల్ ఆర్.శంకర్‌రాజు, పీలేరు ఫైర్‌స్టేషన్ లీడింగ్ ఫైర్‌మెన్ బి.శ్యామ్ ప్రకాశ్‌లకు సేవా పతకాలు ప్రకటించారు.

ఎస్‌ఏ–2 పరీక్షలకు సన్నద్ధం

- 20 నుంచి పాఠశాల విద్యార్థులకు పరీక్షలు ప్రారంభం
- షెడ్యూలు విడుదల చేసిన ఎస్‌సీఈఆర్‌టీ
- ఎండల నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచన

మదనపల్లె సిటీ: ఒకటో తరగతి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షల్లో భాగంగా సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్‌ఏ)–2 పరీక్షలు నిర్వహించేందుకు విద్యాశాఖ సిద్ధమవుతోంది. పరీక్షల షెడ్యూల్‌ను సైతం ఎస్‌సీఈఆర్‌టీ విడుదల చేసింది. షెడ్యూలు ప్రకారం ఫస్ట్ క్లాసు నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఈనెల 20వ తేదీ నుంచి 26వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, 6 నుంచి 9వ తరగతి వరకు 20వ తేదీ నుంచి 28వతేదీ వరకు ఉదయం 9 గంటలకు పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 1,70,248 మంది, ప్రైవేటు పాఠశాలల్లో 83,347 మంది ఈ పరీక్షలకు విద్యార్థులు హాజరు కానున్నారు. 2022–23 విద్యా సంవత్సరం ఆఖరి రోజు ఈనెల 30తో ముగియనుంది. మే నెల 1వతేదీ నుంచి వేసవి సెలవులు ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే విద్యాశాఖ నుంచి అధికారికంగా ఉత్తర్వులు రావాల్సి ఉంది. ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో విద్యార్థుల ఆరోగ్యంపై ఆయా స్కూళ్లకు చెందిన ప్రధానోపాధ్యాయులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.



పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

పరీక్షల షెడ్యూల్ ఇలా..

పాఠశాల విద్యార్థులకు నిర్వహించనున్న పరీక్షలకు సంబంధించిన షెడ్యూల్‌ను ఎస్‌సీఈఆర్‌టీ జారీ చేసింది.ప్రైమరీ 1–5 తరగతులకు 20న తెలుగు, 24న ఇంగ్లీషు, 25న మ్యాథ్స్, 26న ఈవీఎస్, 6 నుంచి 9 తరగతులకు 20న తెలుగు, 24న హిందీ, 25న ఇంగ్లీషు, 26న మ్యాథ్స్, 27న జనరల్ సైన్సు, 28న సోషియల్ పరీక్షలుంటాయి.

సీబీఏ విధానంలో పరీక్షలు

తరగతి ఆధారిత మదింపు (క్లాసు రూం బేస్డ్ అసెస్మెంట్) (సీబీఏ) విధానంలోనే సమ్మేటివ్–2 పరీక్షలను నిర్వహించనున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఎస్‌సీఈఆర్‌టీ సీబీఏ విధానాన్ని కొన్ని పరీక్షలకు అమలు చేస్తోంది. ఫార్మేటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్‌ఏ) –1,3 పరీక్షలను ఇప్పటికే అమలు చేయగా, ఎఫ్‌ఏ–2 ,ఎఫ్‌ఏ–4, సమ్మేటివ్–1 పరీక్షలను పాత విధానంలోనే అధికారులు నిర్వహించారు. ఈనెల 20వతేదీ నుంచి జరగనున్న పరీక్షలకు సైతం సీబీఏ(ఓఎంఆర్) విధానాన్ని అమలు చేయనున్నారు.

అంబేడ్కర్ వర్సిటీ డైరెక్టర్‌గా ఎల్‌వీకే



రాజంపేట టౌన్: రాజంపేట మండలం బ్రాహ్మణపల్లెకు చెందిన డాక్టర్ ఎల్.విజయకృష్ణారెడ్డి (ఎల్‌వీకే) డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం అభ్యాసక సహాయ, సేవావిభాగం డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈమేరకు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఉత్తర్వులు జారీ చేశారని ఎల్‌వీకే గురువారం ఇక్కడి విలేకరులకు ఫోన్ ద్వారా తెలిపారు. గత ఏడాది జూలై నుంచి ఎల్‌వీకే అంబేడ్కర్ వర్సిటీకి ఇన్‌చార్జి డైరెక్టర్‌గా సేవలందించారు. ఇటీవల పదోన్నతితో జాయింట్ డైరెక్టర్‌గా నియమింపబడ్డ ఆయన ఇప్పుడు డైరెక్టర్‌గా నియమితులయ్యారు. గతంలో ఆయన జర్నలిస్టుగా సుదీర్ఘకాలం పనిచేశారు. ఆ అనుభవంతో గతంలోని ప్రభుత్వం సమాచార, పౌరసంబంధాల శాఖలో సిబ్బందికి శిక్షణ, పునశ్చరణ కోసం ఆయనను ప్రత్యేక అధికారిగా నియమించింది. 2020 మార్చి నుంచి దాదాపు రెండేళ్లపాటు నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా కూడా ఎల్‌వీకే పనిచేశారు. ఆయన సంపాదకత్వంలో ఎనిమిది పుస్తకాలు వెలువడ్డాయి.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కందుకూరు సమీపంలోని ఆంజనేయ స్వామి గుడి మలుపు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాద ఘటనలో నలుగురు గాయపడ్డారు. ఇదే పంచాయతీలోని నిలువురాతిపల్లికి చెందిన గంగిరెడ్డి, విజయా, సంతోష్ లు ద్విచక్ర వాహనంలో కందుకూరు నుంచి స్వగ్రామానికి వెళుతుండగా మలుపు వద్ద ఓ సిమెంటు లారీ అడ్డు వచ్చింది. దీంతో ద్విచక్ర వాహనదారుడు లారీని తప్పించే క్రమంలో ప్రమాదవశాత్తు పక్కన పడిపోగా ముగ్గురూ గాయపడ్డారు. వెనుకనే మరో వాహనంలో వస్తున్న పాత కందుకూరుకు చెందిన రెడ్డెప్ప కూడా కిందపడి గాయపడ్డాడు. తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులకు స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ శంకర్ ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో బి.కొత్తకోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఉద్యోగాల పేరుతో మోసం

- ఇద్దరు మోసగాళ్ల అరెస్టు
- 12 సీళ్లు, రెండు సెల్ ఫోన్లు, ఒక ల్యాప్‌ట్యాప్ స్వాధీనం





పోలీసుల అదుపులో మోసగాళ్లు, స్వాధీనం చేసుకున్న సెల్ ఫోన్లు, సీళ్లు, ల్యాప్‌టాప్

రాయచోటిటౌన్ : ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి మోసం చేసిన ఇద్దరు మోసగాళ్లను అరెస్టు చేసి వారి నుంచి రెండు సెల్ ఫోన్లు, 12 సీళ్లు, ఒక ల్యాప్ ట్యాప్ స్వాధీనం చేసుకున్నట్లు అన్నమయ్య జిల్లా రాయచోటి డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. గురువారం రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. అన్నమయ్య జిల్లా గుర్రంకొండ బలిజ గడ్డ వీధికి చెందిన పెమ్మా నవీన్‌కుమార్ గత కొంత కాలంగా రాయచోటి పట్టణం పార్థసారథి వీధిలో నివాసం ఉంటున్నాడు. అలాగే పూలకుంట మహేష్ సత్యసాయి జిల్లా కదిరి రెడ్డివారిపల్లెకు చెందిన వాడు. పెమ్మా నవీన్ కుమార్ ఎంసీఏ, పూలకుంట మహేష్ ఎంబీఏ వరకు చదివారు. అయితే వీరిద్దరూ జల్సాలకు అలవాటు పడి అక్రమంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో అడ్డదారులు తొక్కారు. ఈ క్రమంలోనే నిరుద్యోగులకు ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి వారి నుంచి రూ.లక్షల రూపాయలు దోచుకున్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలోని కలెక్టర్ కార్యాలయంలో డ్రైవర్ ఉద్యోగంతో పాటు మరికొన్ని ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించారు. నందలూరి రామాంజులరెడ్డి అనే వ్యక్తి మరదలికి ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి రూ.1.5లక్షలు తీసుకొన్నారు. అలాగే చిన్నమండెం మండలంలో ఒకరు, రాయచోటి టౌన్‌లో మరో ముగ్గురు, బి. కొత్తకోటకు చెందిన మరో వ్యక్తి నుంచి రూ.6లక్షలు తీసుకున్నారు. విజయనగరం జిల్లాలో 16 మంది నుంచి రూ.55 లక్షలు తీసుకున్నారు. మరో 5 మంది నుంచి రూ.18లక్షలు ఇలా మొత్తం రూ.73 లక్షలు వసూలు చేశారు. నిరుద్యోగులను నమ్మించడానికి వీరు ప్రభుత్వ సీళ్లను కూడా తయారు చేయించారు. అలాంటి 12 సీళ్లు వారి నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అయితే వారు ఉద్యోగం ఇప్పించకపోగా తప్పించుకొనే ప్రయత్నం చేయడంతో బాధితులు రాయచోటి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి నిందితులను రాయచోటి పట్టణంలో అరెస్టు చేశారు. వారి నుంచి 2 సెల్ ఫోన్లు, ఒక ల్యాప్ ట్యాప్, 12 ప్రభుత్వ నకిలీ సీళ్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పెడుతున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి, అర్బన్ ఎస్ఐ నరసింహారెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి
– డీఎల్‌డీఓ లక్ష్మీపతి



కొండామర్రిపల్లె సచివాలయంలో ఆధార్ సేవలను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ లక్ష్మీపతి

మదనపల్లె : వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులు, 2011 సంవత్సరంలో ఆధార్‌కార్డులు పొందిన వారు వెంటనే తమ సచివాలయాల పరిధిలో ఆధార్ అప్‌డేట్ తప్పనిసరిగా చేయించాలని డివిజినల్ అభివృద్ధి అధికారి లక్ష్మీపతి అన్నారు. గురువారం మండలంలోని కొండామర్రిపల్లె సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. స్థానికంగా అందుతున్న ఆధార్ సేవలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. సచివాలయ ఏఎన్‌ఎంలు తమ పరిధిలోని డెలివరీ కేసులకు జనన ధ్రువీకరణపత్రం అందించేలా కృషి చేయాలన్నారు. సర్పంచ్ పాతిమా, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇస్మాయిల్ పాల్గొన్నారు.

మనస్తాపంతో రైతు ఆత్మహత్య

మదనపల్లె : కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెంది రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం పీటీఎం మండలంలో జరిగింది. మండలంలోని సంపతికోట పంచాయతీ కానుగమాకులపల్లెకు చెందిన రమణ కుమారుడు శంకర్ (38) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. గత రెండు సంవత్సరాలుగా టమోటా పంట వేసి నష్టపోయాడు. ఈ క్రమంలో పంట నష్టాలతోపాటూ కుటుంబంలో సమస్యలు ఏర్పడ్డాయి. దీంతో మనస్తాపానికి గురైన శంకర్ గురువారం పొలం వద్దకు వెళ్లి పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అపస్మారకస్థితిలో ఉన్న బాధితున్ని కుటుంబ సభ్యులు గుర్తించి వెంటనే బి.కొత్తకోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో అక్కడి వైద్యులు మదనపల్లె ప్రభుత్వజిల్లా ఆసుపత్రికి రెఫర్ చేశారు. 108 వాహనంలో ఆసుపత్రికి తీసుకురాగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే శంకర్ మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతునికి భార్య శ్రావణికుమారి, కుమార్తెలు వర్షిణి, హర్షిణిలు ఉన్నారు. కుటుంబ యజమాని మృత్యువాత పడటంతో వారు కన్నీటి పర్యంతమయ్యారు. ఆసుపత్రి అవుట్‌పోస్టు సిబ్బంది బి.కొత్తకోట పోలీసులకు సమాచారం అందించారు.

కుటుంబ కలహాలతో..

పెద్దతిప్పసముద్రం : మండలంలోని సంపతికోట పంచాయతీ కానగమాకులపల్లికి చెందిన తలకాయలకొండ శంకర్ (36) గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ కలహాల కారణంగా శంకర్ జీవితంపై విరక్తి చెంది సమీపంలోని వ్యవసాయ పొలం వద్ద పురుగుల మంది తాగి ఆత్మహత్యాయత్నం చేసి అపస్మారక స్థితిలో పడిఉండగా కుటుంబ సభ్యులు 108 వాహనంకు సమాచారం అందించారు. బి.కొత్తకోటలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బిందు, తుంపర సేద్యంలో జిల్లాకు ద్వితీయస్థానం

జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి



బిందు, తుంపర సేద్యం పరికరాలు పరిశీలిస్తున్న జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి

కేవీపల్లె : బిందు, తుంపర్ల సేద్యంలో జిల్లాకు ద్వితీయ స్థానం లభించిందని జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గ్యారంపల్లె తదితర గ్రామాల్లో బిందు, తుంపర్ల సేద్యం అంతిమ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు కింద గత ఆర్థిక సంవత్సరం జిల్లాలో 9,700 హెక్టార్లకు బిందు, తుంపర్ల సేద్యం పరికరాలు సరఫరా చేయడం లక్ష్యంగా పెట్టుకోగా 10,754 హెక్టార్లలో ఏర్పాటు చేసి లక్ష్యానికి మించి చేసినట్లు వివరించారు. బిందు, తుంపర్ల సేద్యం పరికరాలను అధిక విస్తీర్ణంలో ఏర్పాటు చేసినందుకు గానూ జిల్లాకు రాష్ట్రంలో రెండో స్థానం, దేశ వ్యాప్తంగా పదవ స్థానం లభించిందని తెలిపారు. కార్యక్రమంలో పీలేరు డివిజన్ ఉద్యాన అధికారి సుకుమార్‌రెడ్డి, ఎంఐడీసీ హరినారాయణ, ఎంఐ ఇంజనీర్ గురుప్రసాద్, ఎంఏవో దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

బిందు సేద్యం పరికరాలు తనిఖీ చేయాలి

వాల్మీకిపురం : రైతులు పొలాల్లో అమర్చిన బిందు సేద్యం పరికరాలపై అంతిమ తనిఖీలు నిర్వహించాలని జిల్లా సూక్ష్మ నీటిసాగు అధికారి వెంకటేశ్వర రెడ్డి అన్నారు. గురువారం వాల్మీకిపురం, కలికిరి, గుర్రంకొండ మండలాల్లో ఉద్యాన, వ్యవసాయ, మల్బరీ సహాయకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారిణి లక్ష్మీ ప్రసన్న, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

కేవీపల్లె : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నట్లు ఏపీ మోడల్ స్కూల్స్ జాయింట్ డైరెక్టర్, జగనన్న విద్యా కానుక (జేవీకే) స్టాక్ పాయింట్ పరిశీలకులు ఎం. వెంకటకృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కేవీపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో జేవీకే-4 మండల టీం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఎంఈవో రెడ్డిబాషా, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రెడ్డిప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి చేయలేదని ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : తనకు తల్లిదండ్రులు పెళ్లి చేయలేదనే మనస్తాపంతో యువకుడు ఆత్మహత్యకు యత్నించిన సంఘటన సత్యసాయి జిల్లా తనకల్లు మండలం కొక్కంటిక్రాస్ పంచాయతీ కోటపల్లెలో జరిగింది. మొలకలచెరువు మండలం చౌడసముద్రం పంచాయతీ సుంచువారిపల్లెకు చెందిన కృష్ణప్ప కుమారుడు టి.గుర్రప్ప (27) సత్యసాయి జిల్లా కొక్కంటిక్రాస్ కోటపల్లెలోని బంధువుల ఇంటికి బుధవారం వెళ్లాడు. అక్కడ కుటుంబ సభ్యులతో తన వివాహ విషయమై గొడవ పడ్డాడు. తల్లిదండ్రులు తనకు పెళ్లి చేయలేదన్న మనస్తాపంతో అక్కడే గురువారం తెల్లవారుజామున పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితున్ని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

ఆటో బోల్తా - ఇద్దరికి తీవ్ర గాయాలు

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని దొరిచెరువు వద్ద ఆటోబోల్తా పడి ఇద్దరు తీవ్రంగా గాయపడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గురువారం లక్కిరెడ్డిపల్లి నుండి వారి స్వగ్రామమైన చెంచర్లపల్లెకు ఆటో బాడుగకు తీసుకొని వెళ్తుండగా దొరిచెరువు వద్ద కాలువలోకి దూసుకువెళ్లింది. దీంతో ఆటోలో ఉన్న వేముల రమణమ్మ, వేముల రెడ్డమ్మ తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే 108 వాహనం ద్వారా లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కుక్కల గుంపును తప్పించబోయి ఆటో బోల్తా
– తల్లీ కుమార్తెకు గాయాలు

మదనపల్లె : ఆటో బోల్తాపడి తల్లీ, కుమార్తెలు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం బి.కొత్తకోట మండలంలో జరిగింది. కాండ్లమడుగు క్రాస్‌కు చెందిన లక్ష్మీదేవి (30), తన కుమార్తె విష్ణుప్రియ (4)తో కలిసి గొల్లపల్లె నుంచి ఆటోలో కాండ్లమడుగు క్రాస్‌కు బయలుదేరింది. మార్గమధ్యంలోని యర్రమద్దివారిపల్లె వద్ద కుక్కలగుంపు అడ్డుగా రావడంతో వాటిని తప్పించే క్రమంలో ఆటో బోల్తాపడింది. ప్రమాదంలో లక్ష్మీదేవి, విష్ణుప్రియలు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అత్తపై అల్లుడి దాడి

మదనపల్లె : అత్తపై అల్లుడు దాడి చేసి తీవ్రంగా గాయపరచిన సంఘటన గురువారం మదనపల్లె మండలంలో జరిగింది. కొండామర్రిపల్లె పంచాయతీ బెస్తపల్లెకు చెందిన రామలక్ష్మి (55) తన కుమార్తె సావిత్రిని పట్టణంలోని చంద్రాకాలనీకి చెందిన గురునాథ్‌కి ఇచ్చి వివాహం చేసింది. వారికి ముగ్గురు సంతానం ఉన్నారు. అయితే గత 20 రోజుల క్రితం గురునాథ్ భార్య సావిత్రి కనిపించకుండా పోయింది. అప్పటి నుంచి అతను భార్య కోసం గాలిస్తున్నాడు. ఈ క్రమంలో భార్యపై తనకు ఉన్న కోపాన్ని అత్త రామలక్ష్మిపై చూపి గురువారం ఫోన్ చేసి ఎక్కడ ఉన్నావంటూ అడిగాడు. ఇంటి వద్ద ఉన్నానని చెప్పడంతో బెస్తపల్లెకు వెళ్లి అత్త రామలక్ష్మితో గొడవకు దిగాడు. కర్రతో ఆమె కాళ్లపై విచక్షణా రహితంగా కొట్టి దాడి చేసి గాయపరిచాడు. ఈ దాడిలో రామలక్ష్మి రెండుకాళ్లు విరిగి తీవ్రంగా గాయపడింది. స్థానికులు ఆమెను మదనపల్లె జిల్లాప్రభుత్వాసుపత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

పాముకాటుతో మహిళకు అస్వస్థత

మదనపల్లె : పాముకాటుతో మహిళ తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన గురువారం మొలకలచెరువు మండలంలో జరిగింది. కాలువపల్లెకు చెందిన జయచంద్రారెడ్డి భార్య ఆర్.శ్యామలమ్మ (45) పొలం వద్ద గడ్డిమోపులు ఎత్తుతుండగా పాము కాటువేసింది. దీంతో ఆమె తీవ్ర అస్వస్థతకు గురైంది. గమనించిన కుటుంబ సభ్యులు 108వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

ఘర్షణ - కేసు నమోదు

చిన్నమండెం : మండలంలోని కురవపల్లెలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. వివరాలిలాఉన్నాయి.. కురవపల్లె గ్రామంలో బంధువులైన ఇద్దరు వ్యక్తులు, వారి మధ్య ఉన్నటువంటి భూసమస్యలు మనసులో ఉంచుకొని తన కూతుర్ని తిడుతున్నాడని కారణంతో రెడ్డెప్ప అనే వ్యక్తి చేతితో, రాయితో కొట్టగా శ్రీరాములు గాయపడ్డారన్నారు. శ్రీరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి

తంబళ్లపల్లె : ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జ్ పీడీ ధనలక్ష్మీ కోరారు. గురువారం తంబళ్లపల్లె ఎంపీడీవో కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రత్యేక సమావేశం జరిగింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేస్తున్న పథకాలు నిర్వహణ, సాధించిన ప్రగతి తదితర అంశాలపై ఆరా తీశారు. తంబళ్లపల్లె, పెద్దమండ్యం, ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం మండలాల్లోని 273 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు ఈ సమావేశానికి హాజరయ్యారు. అందరూ సమిష్టిగా కేంద్రాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీడీపీవో నాగవేణి, ఎంపీడీవో ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

సమస్యలపై వెంటనే స్పందించాలి

గ్రామాలలోని సమస్యలపై పంచాయితీ కార్యదర్శులు వెంటనే స్పందించి పరిష్కరించాలని డీపీవో ధనలక్ష్మీ ఆదేశించారు. గురువారం ఆమె ఎంపీడీవో కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. తాగునీరు, డ్రైనేజీ, పరిశుభ్రత కార్యక్రమాలపై ఆరా తీశారు. అనంతరం ఎర్రసానిపల్లె డంపింగ్‌యార్డును పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో భవన నిర్మాణ కార్మికుడి దుర్మరణం

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో ఆటో ఢీకొని భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందిన సంఘటన బి.కొత్తకోట మండలంలో బుధవారం రాత్రి జరిగింది. మదనపల్లె పట్టణంలోని పిఅండ్‌టి కాలనీ కురవంకకు చెందిన శివనారాయణ, సరస్వతి దంపతుల కుమారుడు కె.భానుప్రకాష్ (27) భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తూ జీవిస్తున్నాడు. తండ్రి శివనారాయణ కొంతకాలం క్రితమే చనిపోవడంతో కుటుంబ బాధ్యతలు మోస్తూ భవన నిర్మాణ కార్మికునిగా పనిచేస్తున్నాడు. బుధవారం బి.కొత్తకోటలో పనులకు వెళ్లి అర్ధరాత్రి వరకు పనులు చేశాడు. ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వస్తుండగా నాయునిబావి వద్ద ఎదురుగా వచ్చిన ఆటో ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో భానుప్రకాష్ తీవ్రంగా గాయపడగా స్థానికులు 108 వాహనంలో మదనపల్లె జిల్లాప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్సల కోసం స్థానిక వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు. తిరుపతిలో చికిత్సలు పొందుతూ గురువారం తెల్లవారుజామున భానుప్రకాష్ మృతి చెందాడు. బి.కొత్తకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఓ వైపు భర్తను పోగొట్టుకుని, ఓ వైపు కన్న బిడ్డను దూరం చేసుకున్న తల్లి సరస్వతి, సోదరుడు హరి తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

నేల సారవంతంపై దృష్టి సారించాలి

జిల్లా వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ



మట్టి నమూనాలు పరిశీలిస్తున్న డీఏవో ఉమామహేశ్వరమ్మ

కేవీపల్లె : నేల సారవంతంపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ అన్నారు. గురువారం మండలంలోని గ్యారంపల్లెలో 'నేల ఆరోగ్యం, భూసార పరీక్ష' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆమె మట్టి నమూనా సేకరణ విధానాన్ని పరిశీలించారు. అనంతరం గ్యారంపల్లె ఆర్‌బీకేలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మండల స్థాయిలో ప్రతి ఆర్‌బీకే నుంచి రెండు శ్యాంపిల్స్ చొప్పున మట్టి నమూనాలు సేకరించాలన్నారు. మట్టి నమూనాలతో సరైన ఫలితాన్ని రాబట్టాలన్నారు. భూసార పరీక్షల ఫలితం ఆధారంగా రైతులు తమ పొలాల నేలను కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ వై.వి. రమణరావు, ఏవో శ్రావణి, రైతు సలహా మండలి సభ్యుడు బోడేషావలి, ఎఫ్‌పీవో ఛైర్మన్ జయబ్బనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని యువకుడి మృతి



భానుప్రకాష్ (ఫైల్)

బి.కొత్తకోట : బైక్‌పై మదనపల్లె వెళ్తున్న యువకుడ్ని ఆటో ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి చికిత్సపొందుతూ మృతి చెందిన ఘటన బి.కొత్తకోట మండలంలో జరిగింది. ఎస్ఐ రామమోహన్ కథనం మేరకు వివరాలు..మదనపల్లె పీఅండ్‌టీ కాలనీకి చెందిన కోటకొండ భానుప్రకాష్ (29) బుధవారం రాత్రి బైక్‌పై బి.కొత్తకోట నుంచి మదనపల్లెకు వెళ్తున్నాడు. మార్గమధ్యంలో నాయనబావి వద్ద మదనపల్లె వైపు నుంచి బి.కొత్తకోటకు వస్తున్న ఆటో భానుప్రకాష్‌ను ఢీకొంది. ఈ ఘటనలో తలకు, ఎడమ కాలు తొడకు తీవ్ర గాయాలకు గురైన బాధితున్ని 108లో మదనపల్లెకు తరలించి వైద్యం అందించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్టు తెలిపారు. ఆటో డ్రైవర్ గురికానిపల్లెకు చెందిన సుదర్శన్ నిర్లక్ష్యంగా నడుపుకొంటూ వచ్చి ప్రమాదానికి కారుకుడైనట్టు నిర్ధారించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

పోస్టల్ సేవింగ్స్‌తో అధిక వడ్డీ

జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ చెన్నకేశవులు



మహిళా సన్మాన్ సేవింగ్స్ కరపత్రం ఆవిష్కరిస్తున్న పోస్టల్ సూపరింటెండెంట్ చెన్నకేశవులు

మదనపల్లె సిటీ : పోస్టాఫీసుల్లో సేవింగ్స్ చేయడంతో అధిక వడ్డీ పొందవచ్చునని చిత్తూరు జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ ఎం.చెన్నకేశవులు తెలిపారు. గురువారం మదనపల్లె పోస్టల్ ప్రధాన కార్యాలయంలో మహిళా సన్మాన్ సేవింగ్స్ కరపత్రం ఆవిష్కరించారు. మహిళలకు మరింత ఆర్థిక భరోసా కల్పించేందుకు మహిళా సమ్మాన్ సేవింగ్స్ పథకాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ పథకంలో చేరే మహిళలకు తక్కువ కాలంలో అధిక వడ్డీ పొందే అవకాశం ఉందన్నారు. 2023 ఏప్రిల్ 1 నుంచి ఈ పథకం అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు. ఈ పథకం మహిళల కోసమే ప్రారంభించినట్లు తెలిపారు. ఈ పథకంలో చేరదలచిన మహిళలు తమ సమీప పోస్టాఫీసులలో సంప్రదించాలన్నారు. మదనపల్లె పోస్టల్ ఏఎస్పీ బి.నీలిమ మాట్లాడారు. కార్యక్రమంలో హెడ్‌పోస్టుమాస్టర్ బి.వి.రమణ మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల ఘర్షణ

మదనపల్లె : ఆటో బాడుగలు తోలే క్రమంలో డ్రైవర్ల మధ్య వివాదం ఏర్పడి జరిగిన ఘర్షణలో ఇద్దరు ఆటో డ్రైవర్లు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం రాత్రి మదనపల్లె పట్టణంలో జరిగింది. సొసైటీకాలనీలోని ఓ ప్రవేటు ఆసుపత్రి సమీపంలో రోగి, అతని కుటుంబ సభ్యులు ఇంటికి వెళ్లేందుకు ఆసుపత్రి నుంచి బయటకు రాగా ఒకేసారి ఇద్దరు ఆటో డ్రైవర్లు తమ ఆటోలను బాడుగకు వెళ్లేందుకు వారి ముందు ఉంచారు. అయితే వారు ఒక ఆటోలో ఎక్కగా మరోఆటో అడ్డుగా ఉంచి సీరియల్‌లో నేను ఉండగా నీవు ఎలా బాడుగ వెళ్తావు అంటూ డ్రైవర్‌తో వాగ్వివాదానికి మరో డ్రైవర్ ప్రశ్నించాడు. దీంతో ఇద్దరి మధ్య వివాదం ఏర్పడి ఒకరిపై ఒకరు రాళ్లదాడికి పాల్పడ్డారు. ఘర్షణలో ఆటో డ్రైవర్ రెడ్డిశేఖర్ (40) తీవ్రంగా గాయపడగా మరో డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు బాధితున్ని జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.